క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: మండలంలోని పురోహితునివలస ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అంజలీదేవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 13 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 15న పాఠశాలలో ప్రవేశపరీక్ష నిర్వహించి, ప్రతిభ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 9885569242, 7660950012, 8328443654, 9121573367 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజీనామా


రంగుముద్రి రమాదేవి


పార్వతీపురం టౌన్: రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్ రంగుముద్రి రమాదేవి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో తనకు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి దక్కిందన్నారు. తనకు ఇచ్చిన పదవిని సద్వినియోగం చేసుకుని దాసరి కులస్తులందరికీ న్యాయం చేశానని తెలిపారు.

సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘ రాష్ట్ర కార్యదర్శి ధనంజయరావు

పార్వతీపురం టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనంజయరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం పాఠశాల విద్యకు తీవ్ర నష్టం కలిగించిన జీఓ 117 రద్దుపై మొదటి సంతకం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వేలాది టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని.. సీపీఎస్ రద్దుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘ పార్వతీపురం మన్యం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.శివన్నాయుడు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ధనుంజయనాయుడు, పి కూర్మనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పారవశ్యం


పూజలు అందుకుంటున్న అభయాంజనేయస్వామి


పాలకొండ రూరల్: హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక బల్లంకి వీధిలో ఉన్న అభయాంజనేయ ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొని స్వామికి వివిధ రకాల పుష్పాలు, సింధూరంతో అర్చన చేశారు. అర్చకులు విభూది రవిస్వామి నేతృత్వంలో హనుమాన్‌చాలీసా పఠనం చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో వేలాదిగా భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా శ్రోతను అలరించింది.

రామోజీరావుకు ఏజెన్సీ ప్రెస్‌క్లబ్ నివాళి


రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏజెన్సీ ప్రెస్‌క్లబ్ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి పట్ల గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రెస్‌క్లబ్ సభ్యులు ప్రగాఢ సంతాపం ప్రకటించి, నివాళులర్పించారు. మండలంలోని ఎల్విన్‌పేటలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పత్రికా రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు పి.కొండలరావు, ఎస్.శ్రీనివాస్, బి.కుమారస్వామి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు


తారురోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కురుపాం: మండల కేంద్రం నుంచి గుమ్మలక్ష్మీపురం మండలంలోని మండ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రెండు రోజుల్లో నిర్మాణ పనులు కావస్తున్నాయని రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఈ పనులకు రెండు నెలల క్రితం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. మొత్తం రూ.3.80 కోట్లతో రోడ్డు నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

జగనన్న కార్యకర్తగా నిరంతరం శ్రమిస్తా..

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ ఓటమిని చవి చూసినప్పటికీ తాను మాత్రం జగనన్నకు కార్యకర్తగానే నిరంతరం శ్రమిస్తానని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మండల పరిధిలో గల వైఎస్సార్‌సీపీ శ్రేణులతో శనివారం స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనా కాలంలో మన శక్తికి మించి నియోజకవర్గ ప్రజలందరికీ విశేష సేవలు అందించినప్పటికీ ఓటమి చవి చూడాల్సి వచ్చిందన్నారు. మన మందరం కూడా ప్రజాతీర్పుకు గౌరవం ఇస్తూ, నియోజకవర్గ ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. ప్రజల పక్షాన వారి సమస్యలపై ప్రజా గొంతుకుగా నిలిచి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇంజినీరింగ్ చదువు పూర్తయిన తర్వాత రెండు సంవత్సరాలు మాత్రమే ఉద్యోగం చేశానని, అనంతరం 25 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూశానని చెప్పారు. అయినప్పటికీ ఏనాడూ ప్రజాక్షేత్రాన్ని విడిచిపోలేద ని స్పష్టం చేశారు. 2014లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి తీవ్రంగా నష్టపోయినప్పటికీ, తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి ఇంతవరకు ప్రజల పక్షాన నిలబడ్డానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, మండల సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్త లు, తదితరులు పాల్గొన్నారు.

రశీదులు తీసుకోవాలి

- ఏఓ అవినాష్


వరి విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పకుండా రశీదులు తీసుకోవాలని ఏఓ ఎస్. అవినాష్ సూచించారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ విక్రయ కేంద్రంలో వరి విత్తనాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా 400 గ్రాముల విత్తనాలను రీజనల్ పరీక్ష కేంద్రానికి పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు మొలకశాతం తెలుసుకోవాలన్నారు. 85 శాతం మొలకలు వస్తే మంచి విత్తనాలుగా భావించాలని, లేనిపక్షంలో విత్తనాలను తిరిగి ఇచ్చేయాలని చెప్పారు. విత్తన నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని వ్యాపారులకు సూచించారు. వ్యవసాయశాఖ సిఫార్సు లేకుండా ఎటువంటి విత్తనాలు కొనుగోలు చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ ఏరియా మేనేజర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పాలకొండ రూరల్: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సూచించారు. కార్యదర్శులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న క్రమంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. లోతట్టు, శివారు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి, మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలని, తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు సబంధించి వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ మేరకు పంచాయతీల వారీగా సమీక్ష చేపట్టారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పాలకొండ: స్థానిక గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి చిట్టిబాబు శర్మ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో పార్వతీపరమేశ్వరుల వార్షిక కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దుస్తుల పంపిణీ

బాడంగి: మండలంలోని పిన్నవలస గ్రామంలో ఎన్ఆర్ఐ కొల్లి రామినాయుడు దుస్తుల పంపిణీ శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బేబీ నాయన చేతుల మీదుగా నిరుపేద మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లేనని, ప్రతిఒక్కరూ మానవసేవే మాధవసేవగా భావించి, ప్రజాసేవకు ముందుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఇంతమంచి కార్యక్రమం తలపెట్టిన రామినాయుడును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, టీడీపీ నాయకుడు తెంటు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సత్యనారాయణకు నివాళులు


సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం : కామ్రేడ్ సత్యనారాయణ జీవితం పోరాటాలతోనే ముగిసిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో పరస సత్యనారాయణ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. ఎమ్మెల్యేగా పనిచేసినప్పటికీ ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా, నిరాడంబర జీవితం గడిపారని చెప్పారు. ఎమ్మెల్యేకు వచ్చిన అలెవెన్స్‌లను కూడా పార్టీకి జమ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో స్కీమ్ వర్కర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


ఆస్పత్రి రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్ మోహనరావు

గరుగుబిల్లి: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్‌మోహనరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించి, అక్కడి వైద్యుల పనితీరు, రికార్డులు, ల్యాబ్‌లు, రోగులు పొందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్యంఅందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. జ్వర లక్షణాలతో ఆస్పత్రిని ఆశ్రయించే వారికి మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. పాము కాటు, కుక్కకాటులకు సంబంధించిన ఏఆర్‌వీ, ఏఎస్‌వీ ఇంజెక్షన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది పర్యటించి, పరిశుభ్రతా చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్, ఏఎంవో సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కురుపాం: మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పలు గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేపడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు మలేరియా వ్యాప్తి చెందకుండా ఈ చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ బి.ప్రజ్ఞ తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు కూడా వాడాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించి, ఎక్కడా మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి. సత్యరాజ్, ఎ.నాగేశ్వరరావు, జె.తిరుపతిరావు, కేశవ, ఎం.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాల నిర్వహణ బాగుండాలి


నియోనటల్ అంబులెన్స్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ మన్మథనాయుడు

పాలకొండ రూరల్: ప్రజలకు అత్యవసర సమయాల్లో సేవలందించే 108 వాహనాల పనితీరును నింతరం పర్యవేక్షిస్తుండాలని ఆ సంస్థ జిల్లా మేనేజర్ ఎస్.మన్మథనాయుడు అన్నారు. శనివారం పాలకొండ వచ్చిన ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రిలో 108 సిబ్బందితో సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలో అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వాహనాల కండీషన్ సక్రమంగా ఉండేలా విధుల్లో ఉన్న సిబ్బంది అనుక్షణం పరిశీలించాలన్నారు. సమస్యలు గుర్తిస్తే తక్షణమే ఉన్నతాధికారులకు వివరించాలన్నారు. ఈ క్రమంలో నియోనాటల్ అంబులెన్స్ పనితీరును, రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆయన వెంట డివిజనల్ అధికారి బి.విజయ్‌కుమార్ తదితరులున్నారు.

వృక్ష సంపదే లక్ష్యం


ఆటోలో తరలించేందుకు సిద్ధం చేసిన మొక్కలు

రాజాం సిటీ: రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని అధిగమించేందుకు వృక్ష సంపదే లక్ష్యంగా పర్యావరణ పరిరక్షణ సమితి అడుగులు వేస్తోంది. అనుకున్నదే తడవుగా ఈ నెల 5వ తేదీ నుంచే రాజాం పట్టణంలో వెయ్యి మొక్కలు నాటుదాం-వెయ్యి వృక్షాలు చేద్దాం పేరిట మొక్కల పెంపకానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా మొక్కలు నాటే ప్రాంతాల వాసులతో సమితి సభ్యులు సమావేశమై, మొక్కల పెంపకం ఆవశ్యకత, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. దీంతో వారంతా మొక్కలు నాటేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక పట్టణ పరిధిలోని అమ్మవారి కాలనీ, పొనుగుటివలస, మల్లిఖార్జునకాలనీ, సారథి తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. పట్టణ పరిధిలోని ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదిస్తే మొక్కలు అందిస్తామని సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు తెలిపారు. కదంబ, నేరేడు, వేప, కాగు, రోజా, ర్యాలీ, బాదం తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఇంటింటి కుళాయి పనులు వేగవంతం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలో జేజేఎం పథకం ద్వారా ఇంటింటి కుళాయి పనులు వేగవంతంగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని బల్లకృష్ణాపురంలో జేజేఎం నిధులు రూ. 24 లక్షలతో చేపడుతున్న ఇంటింటి కుళాయి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని గ్రామాల్లో రూ. 2.6 కోట్లతో ఇంటింటి కుళాయి పనులు చేపడుతున్నామన్నారు. పనులు పూర్తయిన గ్రామాల్లో తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. కొన్ని గ్రామాల్లో నిధులు చాలకపోవడతో గ్రామ పంచాయతీల నిధులు, జీజీఎంపీ నిధులతో పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఆర్. తవిటినాయుడు, ఉప సర్పంచ్ బి.జగన్నాథం, మాజీ సర్పంచ్‌లు ఎస్.రామకృష్ణ, దాసరి సింహాచలం, బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎన్ఆర్ఈజీఎస్ జేఈలు కృష్ణ, జానకి


రామవరం మంచినీటి కోనేరులో వేతనదారులు

సీతానగరం: మండలంలో అమలవుతున్న అమృత్ సరోవర్ పథకం ద్వారా ఉపాధి హామీ పథకం పనులతో మంచినీటి కోనేరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ జేఈలు కృష్ణ, జానికి అన్నారు. మండలంలోని రామవరంలో మంచినీటి కోనేరులో చేపడుతున్న పనులను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భావితరాల కోసం నీటివనరులను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ నేపథ్యంలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా ఉపాధి వేతనదారులతో కోనేరులను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. రామవరంలో 240 మంది వేతనదారులతో కోనేరు పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

పరామర్శ


రాంబాయిను ఓదార్చి ధైర్యం చెబుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


యర్ర దాలినాయుడును పరామర్శిస్తున్న పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సరిపల్లి రాంబాయిని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శనివారం పరామర్శించారు. రాంబాయి రెండో కుమారుడు సాయివంశీ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రాజన్నదొర ఆమె ఇంటికి వెళ్లి ఓదార్చారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పీఏసీఎస్ చైర్మన్ యర్ర దాలినాయుడును కూడా రాజన్నదొర పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు సూరిబాబు, గిరి రఘు, రాపాక మాధవరావు, హరిబాలాజీ, కర్రి మహేష్, సన్యాసిరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలం వ్యాధులు ప్రబలేందుకు అనుకూలమని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమల్‌నాథ్ అన్నారు. ఈ సమయంలో ఆరోగ్య భద్రతపై ప్రతి ఒక్కరూ వ్యక్తగత శ్రద్ధ వహించాలని సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా పీహెచ్‌సీ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందితో కలిసి శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా దోమ కాటుతో వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జ్వరం, ఇతర వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు.

భూమికి సారం..
పాడిరైతుకు జీవనాధారం


పాలకొండ-లుంబూరు పరిసరాల్లోని పొలాల్లో నిలిపి ఉంచిన జీవాల మంద

- జీవాల మందను పొలంలో నిలపడం ద్వారా నేల సారవంతం
- రైతులకు, జీవాల పెంపకందారులకు లాభదాయకం
- సాగులో సాంప్రదాయ పద్ధతులపై అన్నదాతలు ఆసక్తి

పాలకొండ రూరల్: ఏటా మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందుల వినియోగంతో పంట భూముల్లో సారం తగ్గిపోతుంది. ఫలితంగా దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు. భూసారం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలు, అనుసరించాల్సిన సాగు పద్ధతులపై వ్యవసాయశాఖ సిబ్బంది, శాస్త్రవేత్తలు రైతులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో అన్నదాతల ఆలోచన విధానంలో మార్పు వచ్చింది. పూర్వీకులు అనుసరించిన సంప్రదాయ పద్ధతుల్లో సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా గొర్రెలు, మేకల మందను పొలంలో కాపుకాయడం, చెరువు మట్టిని, కుళ్లిన గత్తంను తీసుకొచ్చి పొలంలో వేయడం, పచ్చిరొట్ట పంటల సాగు, తదితర పద్ధతులను అనుసరిస్తూ భూమిని సారవంతం చేసుకుంటున్నారు.

జీవాల వ్యర్థాలే సేంద్రియ ఎరువుగా..

రైతులు తమ పొలంలో జీవాల మందను నిలిపేందుకు(కాపు కాయడం) అనుమతిస్తే భూమికి సాంప్రదాయ పద్ధతిలో భూ సారంతో పాటు పెంపకం దారులకు ఆదాయ మార్గంగా ఉంటుంది. ముఖ్యంగా గొర్రెలను, మేకలను పెంపకం చేవారు వారి మేత కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. వారిని గుర్తించి సదరు మందలను పొలంబాట పట్టిస్తే మేలు. వీరు పగలంతా మేతకు వెళ్లి గొర్రెలు, మేకల మందను రైతు పొలానికి తీసుకొచ్చి రాత్రంతా అక్కడే ఉంచుతారు. ఒక రాత్రి పొలంలో ఉంచడంతో అవి వేసే పేడ (గెత్తం) వల్ల భూసారం పెరుగుతుంది. ఎకరా పొలంలో నాలుగైదు రాత్రులు మంద కాపు కాయటం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. పంట సమయంలో ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుంది. పురుగుల మందు, ఎరువుల అవశేషాల్లేని ఆరోగ్యకరమైన పంట దిగుబడులను పొందవచ్చు. గొర్రెలు, మేకల(జీవాల) మందలను కాపు కాసేందుకు ప్రస్తుత సీజన్ అనుకూలం. ఖరీఫ్ తరువాత రబీలో ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు వేసుకుంటారు. పంటకోత తరువాత మందలు కాపు కాస్తారు. వేసవి వర్షాలు పడినప్పుడు పొలం దుక్కి చేస్తారు. ఆ సమయంలో గొర్రెలు, మేకల వ్యర్థాలు భూమిలో కలిసి భూసారాన్ని పెంచుతాయి. ఈ వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. శ్రీకాకుళం, ఆమదలవలస, కొల్లివలస, సారవకోట, పాతపట్నం తదితర ప్రాంతాలకు చెందిన యాదవులు, జీవాల పెంపకందారులు ప్రస్తుతం తమ మందలను పాలకొండ పరిసర భూముల్లో కాపు వేయిస్తుండటం విశేషం.

భూసారం పెరుగుతుంది



పొలంలో గొర్రెలు, మేకల మందలను కాపు కాయటం వల్ల వాటి వ్యర్థాలు పొలంలో చేరి సేంద్రియ ఎరువుగా మారుతుంది. దీని వల్ల భూమి సారవంతం అవుతుంది. పంట దిగుబడుల్లో ఎరువులు, పురుగు మందుల ప్రభావం లేకుండా ఉంటుంది. రసాయన ఎరువుల వాడకంతో పంటకు మేలుచేసే మిత్ర పురుగులు నశిస్తాయి. ఏటా మందలు కాపు కాయటం వల్ల భూమి సారవంతమవుతుంది. భూమి పొరల్లో ఉండే మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుంది.

– ఎన్ని వాహిని, వ్యసాయాధికారి, పాలకొండ

భగవద్గీత మోక్ష ప్రదాయిని

రేగిడి: భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలని పాలకొండ ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ సూచించారు. మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠిస్తే చెడుగీతలు చెరిగిపోతాయని, మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అనంతరం భగవద్గీతలోని ముఖ్యాంశాలను వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిత్యస్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ, మోహన్‌దాస్, అప్పలరాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. వేకువజామున 5 గంటలకు ఆలయం తెరిచి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో స్వామి కల్యాణం చేశారు. పట్టణవాసులతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై, స్వామి కల్యాణం తిలకించారు.